క్లుప్తంగా

నేడు అన్నదానం


రామలింగేశ్వర స్వామి

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని మంజీరా క్యాంపస్‌లోని రామలింగేశ్వర దేవాలయంలో మహాశివరాత్రి మండల పూజల్లో భాగంగా సోమవారం స్వామివారికి శివస్వాములు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు మహేష్, గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో శివస్వాములు, భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత


హనుమాన్ చాలీసాలో పాల్గొన్న భక్తులు

పటాన్‌చెరు టౌన్: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని స్వామి వివేకానంద సేవాసమితి జిల్లా అధ్యక్షుడు శేషాద్రి అన్నారు. ఆదివారం మండలంలోని బచ్చుగూడెం హనుమాన్ ఆలయం వద్ద భక్తులతో కలిసి హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం శేషాద్రి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలలో దేశభక్తిని పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు రాంచందర్, బీజేపీ జిల్లా కార్యదర్శి జగన్‌రెడ్డి , బీజేపీ నాయకులు, బజరంగదళ్ కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

బ్యాటరీ వీల్‌చైర్ అందజేత


బ్యాటరీ వీల్‌చైర్‌ను అందజేస్తున్న రవికుమార్

పటాన్‌చెరు టౌన్: కండర క్షీణిత వ్యాధితో బాధపడుతున్న తెల్లాపూర్‌కు చెందిన రెహాన్‌కు తెలంగాణ మస్కులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్ టీఎండీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఆదివారం బ్యాటరీ వీల్‌చైర్‌ను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లాలోని గంగ్యాడ గ్రామానికి చెందిన నాగరత్నంగౌడ్ కుమారుడు శివ ఇటీవలే మరణించారు. అతడికి ప్రభుత్వం ఇచ్చిన బ్యాటరీ వీల్‌చైర్‌ను కండర క్షీణిత వ్యాధితో బాధపడుతున్న వారికి అందజేయాలని నాగరత్నం అడగడంతో రెహాన్‌కు ఇచ్చారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం కార్యదర్శి జ్యోతి, ఇస్నాపూర్ దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు మహేశ్, శ్రీనివాస్, బాపూ వెంకన్న, ముక్తార్, సాయిలు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై శ్రీవారు


ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

సంగారెడ్డి టౌన్ : పట్టణ శివారులోని శ్రీవైకుంఠపురం దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వేంకటేశ్వరస్వామిని సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. దేవాలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపును ప్రారంభించారు. భక్తులు జై శ్రీమన్నారాయణ అంటూ నామస్మరణ చేస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయస్థాయి రెజ్లింగ్ కోచ్‌లుగా ఎంపిక


కోచ్‌లను సన్మానించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్‌లో ఫిజికల్ డైరెక్టర్లుగా పని చేస్తున్న రెజ్లింగ్ కోచ్‌లు ఎం.గణేష్, బానోత్ బాబూ లాల్ జాతీయస్థాయి రెజ్లింగ్ కోచ్‌లుగా రాష్ట్రం నుంచి ఎంపికయ్యారు. ఆదివారం ఎమ్మెల్యే సంజీవరెడ్డిని ఆయన నివాసంలో వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే వారిని అభినందించి, శాలువాలతో సన్మానం చేశారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

- రాష్ట్రంలో రెండో స్పటిక లింగేశ్వరస్వామి ఆలయంగా ప్రసిద్ధి
- ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

హత్నూర(సంగారెడ్డి): మండలం పరిధిలోని దౌల్తాబాద్‌లో భవాని స్పటిక లింగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబయింది. రాష్ట్రంలోనే స్పటిక లింగేశ్వరస్వామి ఆలయం రెండోదిగా ప్రసిద్ధి. 13 సంవత్సరాల క్రితం స్పటిక లింగాన్ని ఇక్కడ ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ప్రతి సోమవారం ఈ ఆలయానికి శివభక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. నేడు (సోమవారం) వసంత పంచమిని పురస్కరించుకొని ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం మొదటి రోజు ఉదయం సుప్రభాత గణపతి హోమం, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన కలశ స్థాపన వివిధ ప్రత్యేక పూజలతో పాటు స్పటిక లింగేశ్వరస్వామి వారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహిస్తారు. సాయంత్రం పూర్ణాహుతి, అగ్నిగుండాలు, జాతర బండ్ల ఊరేగింపు ఉంటుంది. రెండో రోజు మంగళవారం పలు ప్రత్యేక పూజలు కార్యక్రమాలు జరగనున్నాయి. రెండు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు.


భవాని స్పటిక లింగేశ్వర ఆలయం

మాతా మణికేశ్వరి ఓంకార్ ఆశ్రమం వార్షికోత్సవం

హత్నూర మండలం సిరిపురం గ్రామ శివారులోని మాతా మాణిక్యేశ్వరి ఓంకార ఆశ్రమంలో 28వ వార్షిక బ్రహ్మోత్సవాలు వసంతి పంచమి సందర్భంగా సోమవారం శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ పీఠాధిపతి దేవదాసు స్వామి తెలిపారు.

13 ఏళ్లుగా నిర్వహిస్తున్నాం..



13 ఏళ్లుగా భవాని స్పటిక లింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నాం. అంతట శివలింగం రాతితో ఉండగా ఈ ఆలయంలో మాత్రం స్పటికంతో చేసిన శివలింగాన్ని ప్రతిష్ఠించడం విశేషం. రోజురోజుకు స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు.

–ప్రదీప్ శర్మ, ఆలయ పూజారి

కోడ్ వచ్చింది.. ముసుగు వేయరా?


దౌల్తాబాద్ కాసాల చౌరస్తాలో రాజీవ్‌గాంధీ విగ్రహం


హత్నూరలో బాబు జగ్జీవన్ రావ్ విగ్రహం

హత్నూర(సంగారెడ్డి): పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వచ్చినప్పటికీ జాతీయ నాయకుల విగ్రహాలకు అధికారులు ముసుగు వేయలేదు. మండల కేంద్రం హత్నూరలోని బాబుజగ్జీవన్ రామ్‌విగ్రహం, దౌల్తాబాద్ కాసాల సరిహద్దు చౌరస్తాలోని స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి రాజీవ్గాంధీ విగ్రహానికి ముసుకు వేయకపోవడంతో పలువురు అధికారుల తీరుపై విమర్శిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం ఎన్నికల కమిషన్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియను ప్రకటించింది. ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించిన క్షణం నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుంది. వెంటనే జాతీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేయాలి. హత్నూర మండలంలో అధికారులు జాతీయ నాయకుల విగ్రహాలకు ముసుకు వేయకపోవడం చర్చనీయాంశంగా మారింది.

ఏఐటీయూసీలో ఆటోడ్రైవర్ల చేరిక


ఏఐటీయూసీలో చేరిన ఆటోడ్రైవర్లు

నారాయణఖేడ్: పట్టణంలోని ఆటోడ్రైవర్లు ఆదివారం ఏఐటీయూసీ జిల్లా నాయకులు చిరంజీవి సమక్షంలో ఆ సంఘంలో చేరారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆటో డ్రైవర్లకు పూటగడవని పరిస్థితి ఏర్పడిందన్నారు. రుణాలతో ఆటోలు కొన్నవారికి ఫైనాన్స్‌వారి వేధింపులు అధికమయ్యాయని వాపోయారు. ప్రభుత్వం వారిని ఆదుకోవాలని కోరారు. సంఘం నాయకులు అశోక్ పాల్గొన్నారు.

మంటల్లో మిషన్‌భగీరథ సామగ్రి


కాలుతున్న మిషన్ భగీరథ ఏజెన్సీ సామగ్రి

మునిపల్లి(అందోల్): గుర్తు తెలియని వ్యక్తులు గడ్డికి నిప్పు పెట్టడంతో మిషన్ భగీరథ సామగ్రి కాలి బుడిదయింది. ఆదివారం మండలంలోని బుదేరా గుట్టపై మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు ఎండిన గడ్డికి నిప్పు పెట్టడంతో మీషన్ భగీరథ ఏజెన్సీ వారి సామగ్రి పూర్తి కాలిపోయినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అంగద్ తెలిపారు. ప్రభుత్వానికి సంబంధించి మిషన్ భగీరథ డిపార్ట్‌మెంట్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు.

నూతన విద్యా విధానంపై అవగాహన


మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

సంగారెడ్డి టౌన్ : కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న నూతన విద్యా విధానంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని రిటైర్డ్ ఐఏఎస్ ఉమామహేశ్వరరావు అన్నారు. విద్వత్ పరిషత్ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డిపల్లిలోని పీఎస్ఆర్ గార్డెన్ శనివారం రాత్రి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన చరిత్ర నేటి విద్యార్థులు, యువతకు తెలియజేయాలన్నారు. దేశభక్తి, జాతీయ భావాలు కలిగి ఉండాలని సూచించారు. సమావేశంలో సీనియర్ న్యాయవాది వీరారెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ గోవర్ధన్, శిశుమందిర్ విద్యాసంస్థ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహా ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

జహీరాబాద్: ఫిబ్రవరి 7న తలపెట్టిన లక్ష డప్పుల మహా ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. పట్టణంలోని బాబు జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్రహం మాదిగ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని మండలాల బాధ్యులు, కార్యవర్గం సభ్యులు, ఆయా సంఘాల నాయకులు లక్ష డప్పుల కార్యక్రమానికి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ, ఎంఈఎఫ్, మాదిగ దండోరా సంఘాల నాయకులు అబ్రహం,, రాంచందర్, ఉల్లాస్, నవీన్, జయరాజ్, రత్నం, పద్మారావు, రవికుమార్, కైఖేల్, టింకు, సుకుమార్, సుదీష్, శ్రీనివాస్, సునీల్, రాజు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఈ నెల 7న హైదరాబాద్‌లో జరగనున్న లక్ష డప్పులు, వేల గొంతులు సాంస్కృతిక ప్రదర్శనను విజయవంతం చేయాలని భెల్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్ పిలుపునిచ్చారు. ఆదివారం భెల్ టౌన్‌షిప్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మార్పీస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ మూడు దశాబ్దాలుగా ఎస్సీ కులానికి చెందిన 59 ఉపకులాలకు సమాన న్యాయం చేయాలన్న లక్ష్యంతో పోరాటం చేస్తున్నారని అన్నారు. అందుకు అనుకూలంగా కోర్టు తీర్పు వచ్చిందన్నారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న మాదిగ డప్పుల మహాప్రదర్శనకు లక్షాలదిగా మాదిగ ఉద్యోగులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సింగూరు బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పుల్‌కల్(అందోల్): సింగూరులో వెలసిన కల్యాణ సుందర వేంకటేశ్వర స్వామి 38వ బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. రుత్విక్కులు ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో సోమవారం శ్రీవారి కల్యాణానికి నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

4 నుంచి కంప్యూటర్ శిక్షణ

నారాయణఖేడ్: తెలంగాణ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఖేడ్ ఆర్టీఓ కార్యాలయం పక్కన పాత ఐకేపీ కార్యాలయంలో ఈ నెల 4 నుంచి కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి జైపాల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లకు సంబంధించి డీసీఏ, పీజీడీసీఏ, డీటీపీ, హెచ్‌ఎంఎల్, ఫొటోషాప్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. ఉ. 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, మధ్యాహ్నం 1గంట నుంచి సాయంత్రం 4గంటల వరకు తరగతులు కొనసాగుతాయని వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

శివస్వాములకు నిత్య అన్నదానం

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణం సాగర్‌నగర్‌లోని శ్రీకాళిక భవాని మందిరంలో శివగురుస్వామి రమేష్ మేస్త్రీ ఆధ్వర్యంలో శివమాలధారణ స్వాములకు నిత్య అన్నదానం నిర్వహిస్తున్నారు. జనవరి 13 నుంచి శివమాలధారణ స్వాములకు రమేష్ మేస్త్రీ గురుస్వామి గత సంవత్సరం నుంచి శివస్వాములకు నిత్యం అన్నదానంతో పాటు సాయంత్రం అల్పాహారం అందజేస్తున్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం 100 మంది స్వాములు హాజరవుతారు. మహాశివరాత్రి వరకు నిత్య అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

జహీరాబాద్ టౌన్: పట్టణంలో హరే కృష్ణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నగర సంకీర్తనకు మంచి స్పందన లభించింది. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు నగర సంకీర్తన చేస్తూ పాదయాత్ర నిర్వహించారు. నగర సంకీర్తన కార్యక్రమంలో ప్రతివారం భక్తుల సంఖ్య పెరగడం సంతోషకరమని నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు భక్తిభావం పెంపొందించుకోవాలని కోరారు.

కేంద్ర బడ్జెట్‌లో దళితులకు అన్యాయం


బడ్జెట్‌పై నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రకటించిన బడ్జెట్‌లో దళితులకు తీవ్ర అన్యాయం చేశారని కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం ఆరోపించారు. ఆదివారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ.. దేశంలో 20 కోట్ల జనాభా కలిగిన దళితులకు జనాభా దామాషా ప్రకారం బడ్జెట్ కేటాయించలేదన్నారు. కేంద్ర బీజేపీ సర్కార్ గత పదేళ్లుగా కాగితాల్లో అంకెలను పెంచుతూ.. ఖర్చులో తుంచుతూ దళితులకు అన్యాయమే చేస్తుందని విమర్శించారు.

20 శాతం జనాభా కలిగిన దళితులకు 16 శాతం మాత్రమే బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయన్నారు. దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం అమలు చేయకపోవడం వల్ల దళితులకు జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించడం లేదన్నారు. దళితులు నేటికీ అక్షరాస్యతలో 64% దగ్గరే ఆగిపోయారని విమర్శించారు. దశాబ్దకాలంలో కేంద్ర బీజేపీ సర్కార్ దళితుల కోసం కేటాయించిన బడ్జెట్, ఖర్చు చేసిన నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ జిల్లా నాయకులు దత్తు, నితిన్, శ్రీహరి పాల్గొన్నారు.

అసమానతలు పెంచే బడ్జెట్


ప్రవీణ్‌కుమార్, సీపీఎం ఏరియా కార్యదర్శి, సదాశివపేట

సదాశివపేట(సంగారెడ్డి): ప్రజలమధ్య అసమానతలు పెంచే కార్మిక వ్యతిరేక బడ్జెట్ అని సీపీఎం ఏరియా కార్యదర్శి ప్రవీన్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంబాని, అదాని కార్పొరేట్ల కోసమే అన్నట్లుగా ఉందన్నారు. గతంతో పోల్చుకుంటే బడ్జెట్ ఐదుశాతం పెరిగిందన్నారు. మోదీ ప్రభుత్వం బరితెగించి కార్పొరేట్ల కోసం తీసుకువచ్చిన బడ్జెట్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నైబర్‌హుడ్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు


క్యారమ్ ఆడుతున్న మహిళలు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ మాట్లాడుతూ.. ప్రతి ఏటా మున్సిపల్ పరిధిలోని, నల్లగండ్ల పరిధిలోని కాలనీవాసులకు క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 3నెలల పాటు క్రీడాపోటీలు కొనసాగుతాయని చెప్పారు. అందులో భాగంగా ఆదివారం క్యారం, టేబుల్ టెన్నిస్, చెస్, వాలీబాల్ పోటీలను నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో 70 కాలనీలకు చెందిన 1500మంది క్రీడాకారులు పా ల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు అరవింద్, ఆచార్య వెంకట్, దీపక్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని ఆత్మకూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2004-05లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకచోట చేరి గత అనుభవాలు నెమరువేసుకున్నారు. 20 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారంతా ఒకరినొకరు పలకరించుకుని వారి జీవన స్థితిగతులు పంచుకుని రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం ఆనాటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింలు, నాగభూషణం, రమాదేవి, వెంకటపద్మ, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు



జహీరాబాద్ టౌన్: చిన్నారులకు అక్షరభాస్యం చేయిస్తున్న తల్లులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని సరస్వతీ మందిరం, విద్యాసంస్థల్లో ఆదివారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వెంకటరమణనగర్ కాలనీలోని సరస్వతీ మందిరంలో గణపతి పూజ, శ్రీసూక్తం, అభిషేకం, విశేష పంచామృత అభిషేకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు తెల్లవారు జామునుంచే ఆలయానికి చేరుకుని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో చిన్నారులతో అక్షరాభ్యాసాన్ని చేయించారు. పట్టణంలోని శ్రీమాణిక్ ప్రభు, ఆదర్శ విద్యాలయం, భవాన, నారాయణ తదితర పాఠశాలల్లో వసంత పంచమి వేడుకలను నిర్వహించి, అక్షరాభ్యాసాన్ని చేయించారు.

మాణిక్‌ప్రభు ఉన్నత పాఠశాలలో..

జహీరాబాద్: వసంత పంచమి వేడుకలను ఆయా పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ దేవి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ మాణిక్‌ప్రభు ఉన్నత పాఠశాలలో శివయోగి శివాచార్య, మహేష్‌స్వామిలు హాజరై వసంత పంచమి ప్రత్యేకత గురించి వివరించారు. అనంతరం చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య, అధ్యక్షుడు మల్లికార్జున్, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు టౌన్: చదువుల తల్లి ఆశీస్సులు విద్యార్థులపై ఉండాలని మాజీ జెడ్పీటీసీ బీఆర్ఎస్ నేత శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. ఆదివారం వసంత పంచమి నేపథ్యంలో ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలోని జైమా శ్రీవల్లి కమిటీ ఏర్పాటు చేసిన సరస్వతీ దేవి పూజ మండపం వద్ద అఖండ హరి కీర్తన కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వసంత పంచమి చిన్నారుల అక్షరాభ్యాసాన్ని ప్రారంభించడానికి మంచి రోజుగా భావిస్తారని తెలిపారు. అనంతరం నిర్వాహకులు శ్రీకాంత్‌గౌడ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జై మా శ్రీ వల్లీ కమిటీ సభ్యులు కమలేష్, అనిల్ చవాన్, ఇంద్రకుమార్, మనోజ్‌కుమార్ పటేల్, విక్రమ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ అందుబాటులో యూరియా

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట్ మండలం బాచేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో యూరియా అందుబాటులో ఉందని చైర్మన్ సంగారెడ్డి ఆదివారం తెలిపారు. రబీసాగు కోసం రైతులకు యూరియా సిద్ధంగా ఉందన్నారు. పీఏసీఎస్ పరిధిలోని గ్రామాల రైతులు అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

◆ అజ్మీర్ దర్గా సందర్శన

పటాన్‌చెరు: అత్యంత పవిత్ర పుణ్యక్షేత్రంగా భావించే అజ్మీర్ షరీఫ్ ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తీ ఉర్సు ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తరఫున జీఎంఆర్ యువసేన సభ్యులు ×చాదర్‌× సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో జీఎంఆర్ యువసేన సభ్యులు సోహెల్, మసూద్, ఆదిల్, దిల్షాద్, ఇర్ఫాన్, వినయ్, సహిల్ పాల్గొన్నారు.

◆ చాముండేశ్వరి ఆలయానికి పాదయాత్ర

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలం బడంపేట గ్రామానికి చెందిన బీరప్ప ఆలయంలో కొద్ది రోజుల నుంచి పూజలు నిర్వహిస్తున్న శివభక్తులు ఆదివారం చాముండేశ్వరి ఆలయం వరకు పాదయాత్రగా వెళ్లారు. ఉదయం బీరప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి.. అనంతరం మెదక్ జిల్లా చాముండేశ్వరి ఆలయానికి పాదయాత్రగా వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

◆ ఘనంగా రుద్ర హోమం

వట్‌పల్లి(అందోల్): మండలంలోని మేడికుందా గ్రామంలో శివపంచాయతన నవగ్రహ ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు రెండు రోజులుగా కొనసాగుతున్నాయి. ఆదివారం రుద్రహోమం, విగ్రహాలకు ధాన్యాధివాసం, అర్చనలు, హారతులు, సాముహిక కుంకుమార్చనలు వంటి కార్యక్రమాలను బీచ్కుంద పీఠ బసవలింగ వేదపాఠశాల నిర్వాహకులు రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు.

◆ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని ఎల్లారంలో ఆదివారం ఆంజనేయ స్వామి విగ్రహ, శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పూజలు కొనసాగాయి. చివరిరోజు హోమం, విగ్రహ ప్రతిష్ఠాపన కన్నులపండువగా సాగింది. అనంతరం భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

◆ దుండగులను శిక్షించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని ఈఎస్ఐ ఆస్పత్రి సమీపంలోని బీరప్పస్వామి ఆలయాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ అంజయ్య డిమాండ్ చేశారు. ఆదివారం బీరప్పస్వామి ఆలయాన్ని వారు సందర్శించారు. వారు మాట్లాడుతూ తాము అనేక ఏళ్లుగా బీరప్ప స్వామి విగ్రహాలను ఏర్పాటు చేసుకొని పూజలు చేస్తున్నామన్నారు. ఆలయాన్ని కూల్చేసి విగ్రహాలను తీసుకొనిపోవడం దారుణమన్నారు. వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

◆ అన్ని రంగాల్లో రాణించాలి



రామచంద్రాపురం(పటాన్‌చెరు): వడ్డెర కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్.ప్రవీన్‌కుమార్ అన్నారు. ఆదివారం తెల్లాపూర్ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వతంత్ర సమర యోధులు వడ్డే ఓబన్న విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. బ్రిటిష్‌వాళ్లను గడగడలాడించిన వీరుడు వడ్డె ఓబన్న అని అన్నారు. మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంబిసి చైర్మన్ జే.జైపాల్, సంఘం నాయకులు కొల్లూరి సత్తయ్య, స్థానిక వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.